సాక్షి

పశ్చిమగోదావరి

బుధవారం । 13 । ఆగస్టు । 2025



ఆర్టీసీ ఉద్యోగుల ధర్నా

భీమవరం (ప్రకాశంచౌక్): సమస్యల పరిష్కారం కోసం ఆర్టీసీ ఉద్యోగులు జిల్లాలోని డిపోలలో నేషనల్ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.



14న వాలీబాల్ జట్ల ఎంపిక

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా అండర్-15 వాలీబాల్ జట్ల ఎంపిక ఈ నెల 14న ఏలూరు అల్లూరి సీతా రామరాజు స్టేడియంలో జరుగుతుంది.



వైభవంగా గణపతి హోమం

పాలకొల్లు క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో లక్ష్మీగణపతి హోమం నిర్వహించారు. మంగళవారం నిర్వహించిన హోమంలో 13 మంది దంపతులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

ఆత్మీయ కలయిక



వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితో మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు

తణుకు అర్బన్: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మాజీ మంత్రి, పార్టీ రీజనల్ కో-ఆర్డినేటర్ కారుమూరి వెంకట నాగేశ్వరరావు మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో జగన్‌ను కలిశారు.

వైఎస్ జగన్ పర్యటన ఏర్పాట్ల పరిశీలన

సాక్షి, భీమవరం: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం భీమవరం రానున్న నేపథ్యంలో హెలీప్యాడ్ ప్రాంతాన్ని పార్టీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు, భీమవరం నియోజకవర్గ ఇన్‌చార్జి చినమిల్లి వెంకటరాయుడు మంగళవారం పరిశీలించారు. వీఎస్ఎస్ గార్డెన్స్‌లో జరగనున్న ఉంగటూరు మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు కుమార్తె వివాహ వేడుకకు హాజరయ్యేందుకు జగన్ వస్తున్న విషయం తెలిసిందే. జననేతకు స్వాగతం పలుకుతూ పార్టీ శ్రేణులు, అభిమానులు హెలీపాడ్ నుంచి వేదిక వరకూ ఫ్లెక్సీలతో ముంచెత్తారు.

ర్యాగింగ్, గృహహింస అదుపుపై ప్రత్యేక దృష్టి



నరసాపురం సబ్ డివిజన్ శక్తి పోలీసు టీం కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న జిల్లా ఎస్పీ

నరసాపురం: జిల్లాలో ర్యాంగింగ్ నిరోధం, గృహహింస నేరాల అదుపుపై ప్రత్యేక దృష్టిపెట్టినట్టు ఎస్పీ అద్నాన్ నయీం అస్మి తెలిపారు. నరసాపురం పోలీసు సబ్ డివిజన్‌లో శక్తి బృందాల కార్యకలాపాల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక శక్తి పోలీసు టీం కార్యాలయాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. మహిళలు, బాలికలపై జరిగే నేరాలను నియంత్రించడం, కౌన్సిలింగ్ ఇవ్వడం, బాధితులకు సత్వర న్యాయం చేయడం ఈ ప్రత్యేక శక్తి పోలీసుటీం లక్ష్యమని చెప్పారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాల అదుపునకు ప్రత్యేక ప్రణాళికతో పోలీసు శాఖ పనిచేస్తుందని చెప్పారు. డ్రైవింగ్ నిబంధనలు పాటించిన వారికి ప్రోత్సాహకాలు కూడా ఇస్తున్నామని చెప్పారు. వచ్చే నెలలో జిల్లాలో పోలీసులకు కొత్త వాహనాలు వస్తున్నాయని చెప్పారు. రాగానే మరమ్మతులకు గురైన వాహనాల స్థానంలో కొత్తవి ప్రవేశపెడతామని చెప్పారు.

ఆటో డ్రైవర్లకు ఉపాధి కల్పించాలి



ఆటో వర్కర్స్ ఆందోళన చేస్తున్న దృశ్యం

భీమవరం: ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణంతో జీవనోపాధి కోల్పోతున్న ఆటో డ్రైవర్లకు ప్రత్యామ్నాయంగా ఉపాధి కల్పించాలంటూ మంగళవారం భీమవరం కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు యింటి సత్యనారాయణ ఆధ్వర్యంలో జిల్లాలోని వివిధ పట్టణాల ఆటో యూనియన్ల నాయకులు, కార్మికులు పెద్ద సంఖ్యలో కలెక్టరేట్‌కు చేరుకుని ఆందోళన చేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షుడు యింటి సత్యనారాయణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాల అమలులో భాగంగా ఈ నెల 15 నుంచి మహిళలకు ఫ్రీ బస్ అమలుచేయడం వల్ల జిల్లాలో 16 వేల మంది ఆటో కార్మికులు ఉపాధిని కోల్పోతారని ఆందోళన వ్యక్తం చేశారు. ఉచిత బస్సు కారణంగా వీరంతా రోడ్డున పడే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆటో వర్కర్స్‌కు ప్రత్యామ్నాయంగా ఏదైనా ఉపాధి అవకాశాలు కల్పించాలని, కార్మికులకు తగిన న్యాయం చేసేంతవరకు పోరాటం ఆగదని హెచ్చరించారు. అనంతరం కలెక్టరేట్‌లో వినతిపత్రం అందచేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కట్రెడ్డి వెంకటేశ్వరరావు, తలారి వాసు, టీవీకే రాంబాబు, పంపన గోపీ, చెన్నెంశెట్టి వాసు, సంజీవరావు, దుర్గారావు, ములుగుర్తి కృష్ణ, పాలవలస జగన్ మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

అద్దె యజమానుల హడల్

- జిల్లాలో పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ సర్వీసులు 197
- వీటిలో 40 శాతం అద్దె బస్సులే
- 56 సీటింగ్ కెపాసిటీతో నడిపేందుకు ఆర్టీసీతో ఒప్పందం
- ఇప్పుడు ఉచితంతో రద్దీ పెరుగుతుందంటున్న బస్సు యజమానులు
- మైలేజీ పడిపోయి, నిర్వహణ పెరుగుతుందని ఆందోళన
- మైలేజీ పరిమితి తగ్గించాలని, నిర్వహణ ఖర్చు పెంచాలని డిమాండ్



సాక్షి, భీమవరం: ఊహించినట్టే మహిళలకు ఫ్రీ బస్సు హామీని చంద్రబాబు సర్కారు తుస్సుమనిపించింది. జిల్లాలోని పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ సర్వీసులకు మాత్రమే ఉచిత ప్రయాణాన్ని పరిమితం చేసింది. ఈ సర్వీసులు జిల్లాలో 197 ఉండగా వీటిలో 40 శాతం అద్దె బస్సులే ఉన్నాయి. ప్రయాణీకుల రద్దీ పెరిగితే తమ బస్సుల మైలేజీ పడిపోయి మెయింటినెన్స్ పెరిగిపోతుందన్న ఆందోళనలో హైర్ బస్సుల యజమానులు ఉన్నారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు రాష్ట్రమంతటా ప్రయాణం ఉచితమంటూ ఎన్నికల్లో ఊదరగొట్టిన కూటమి ప్లేటు ఫిరాయించింది. ఈ హామీ అమలుకు ఏడాదికి పైగా ఎగనామం పెట్టింది. ఇప్పుడు పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ సర్వీసులకు మాత్రమే ఫ్రీ అంటూ చేతులెత్తేసింది. ఏసీ, సూపర్ లగ్జరీ, అల్ట్రా డీలక్స్, నాన్‌స్టాప్ సర్వీసుల్లో టిక్కెట్ తీసుకోవాల్సిందేనని స్పష్టంచేసింది. జిల్లాలోని భీమవరం, తణుకు, తాడేపల్లిగూడెం, నరసాపురం డిపోల పరిధిలో డిపోల పరిధిలో వెన్నెల, స్టార్‌లైనర్, సూపర్ లగ్జరీ, అల్ట్రా డీలక్స్, పల్లె వెలుగు తదితర బస్సులు 295 ఉన్నాయి. ఇవి మొత్తం రోజుకు లక్ష కిలోమీటర్లు దూరం ప్రయాణిస్తుండగా, 90 వేల మంది ప్రయాణీకులు రాకపోకలు సాగిస్తున్నారు.

40 శాతం హైర్ బస్సులే

ఉచిత ప్రయాణానికి నిర్ణయించిన పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సులు 197 ఉన్నాయి. వీటిలో 73 సర్వీసులను అద్దెకు తీసుకుని నడుపుతున్నారు. హైర్ బస్సులకు 56 సిటీంగ్ కెపాసిటీ ఉండాలి. లీటరు డీజిల్‌కు 5.6 కిలోమీటర్లు ప్రయాణించాలి. మైలేజ్ షార్టేజ్ వస్తే ఆ భారాన్ని తామే భరించాలని యజమానులు అంటున్నారు. మెయింటినెన్స్ కింద ఒప్పందం మేరకు కిలోమీటరుకు రూ.12 నుంచి రూ.13 చొప్పున ఇస్తున్నారు. ఫ్రీ బస్సు వలన ప్రయాణీకుల రద్దీ పెరుగుతుందని వారంటున్నారు. ఓవర్‌లోడ్ వలన టైర్లు అరుగుదల, ఇంజన్ సంబంధిత సమస్యలు తలెత్తి మెయింటినెన్స్ పెరిగిపోతుంది. ఆయిల్ షార్టేజీ వస్తుందని యజమానులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం ఆయిల్ షార్టేజీ వల్ల నెలకు రూ.5 వేల వరకు నష్టపోతుండగా రద్దీతో ఈ నష్టం రూ.20 వేలకు పెరిగే అవకాశముందంటున్నారు. మెయింటినెన్స్ నెలకు రూ.30 వేలు వరకు ఖర్చవుతుంటే రెట్టింపు అవుతుందని చెబుతున్నారు. రవాణశాఖ నిబంధనలు మేరకు సిటీంగ్ కెపాసిటీ 56 మందికే ప్రీమియం చెల్లిస్తామని, ఓవర్ లోడ్‌తో అనుకోని ప్రమాదం జరిగితే బీమా కొందరికే వర్తిస్తుందని చెబుతున్నారు. నిర్ణీత సమయం కంటే ఆలస్యమైతే తమకు పెనాల్టీలు వేస్తున్నారని, రద్దీ వల్ల జరిగే జాప్యానికి తమనే బాధ్యుల్ని చేస్తారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అగ్రిమెంట్‌లో ఫ్రీ బస్సు ప్రస్తావన లేదని, ప్రస్తుత పరిస్థితులకు తగ్గట్టు మైలేజీ లీటరుకు 5.6 కి.మీ నుంచి 4.6 కి.మీ తగ్గించాలని, మెయింటినెన్స్ కి.మీ రూ.13 నుంచి రూ. 18కు పెంచాలని యజమానులు డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు రాష్ట్ర యూనియన్ ఆధ్వర్యంలో ఆందోళనకు సిద్ధమవుతున్నట్టు జిల్లాకు చెందిన నాయకులు తెలిపారు.

సర్వీసులు	మొత్తం బస్సులు	అద్దె బస్సులు
వెన్నెల	1	1
స్టార్ లైనర్	4	–
ఇంద్ర	11	–
సూపర్ లగ్జరీ	33	–
అల్ట్రా డీలక్స్	26	1
ఎక్స్‌ప్రెస్	20	9
అల్ట్రా పల్లెవెలుగు	19	17
పల్లెవెలుగు	158	47
స్పేర్	23	–

ఇప్పటికే నష్టపోతున్నాం



ఎంఎస్ఎంఈలో బస్సు తీసుకుని ఆర్టీసీలో హైర్‌కు నడుపుతున్నాను. నెలకు రూ.1.4 లక్షల వరకు వస్తుంది. బస్సు ఫైనాన్స్ రూ.90 వేలు, డ్రైవర్ల జీతం రూ.40 వేలు, క్లీనర్‌కు రూ.6 వేలు, మెయింటినెన్స్ రూ.30 వేలు పోగా నెలకు రూ.30 వేలు నష్టం వస్తుంది. ఫ్రీ బస్సు వల్ల రద్దీ పెరిగి మైలేజీ షార్టేజీ, మెయింటినెన్స్ పెరిగిపోతాయి. ఈ మేరకు చార్జీల్లో మార్పులు చేయాలి.

– రాపాక మహేష్, హైర్ బస్ యజమాని, సిద్ధాంతం

'వికసిత్ భారత్'పై వర్క్‌షాప్



మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం (ప్రకాశంచౌక్): వికసిత్ భారత్ దార్శనికతను సాకారం చేసుకోవడానికి అవసరమైన ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో వికసిత్ భారత్ లక్ష్యంగా పాఠశాల విద్య అనే అంశంపై వర్క్ షాప్‌లో కలెక్టర్ పాల్గొని పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా వికసిత్ భారత్ లక్ష్యాలను వివరించారు. ఈ వర్క్ షాప్‌లో జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్, విద్యాశాఖ అధికారి ఇ.నారాయణ పాల్గొన్నారు.

నులిపురుగులను నులిమేద్దాం

భీమవరం అర్బన్: పిల్లలు, విద్యార్థులు నులిపురుగుల నివారణ మాత్రలను వేసుకుని కడుపులోనే నులి పురుగులను నులిమేద్దామని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. మండలంలోని చినఅమిరంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మంగళవారం నులిపురుగు నివారణ మాత్రలను పంపిణీ కార్యక్రమాన్ని కలెక్టర్ సీహెచ్ నాగరాణి ప్రారంభించి మాట్లాడారు. 19 ఏళ్ల లోపు వారందరూ తప్పనిసరిగా నులిపురుగుల నివారణ మాత్రలు వేసుకుని ఆరోగ్యంగా ఉండాలన్నారు. తప్పనిసరిగా నులి పురుగుల నివారణ మాత్రలను వేసేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, అధికారులు శ్రద్ధ తీసుకోవాలన్నారు.

డిప్యూటీ స్పీకరైతే.. చట్టాలు మీరి వ్యవహరిస్తారా?

- మాజీ ఎమ్మెల్యే దిగుబాటి రాజగోపాల్
- పాములపర్రు ఘటనపై గ్రామంలో పర్యటన
- భూస్వాములకు అండగా ఉండి దళితులను వేధిస్తారా? అని ఆగ్రహం



పాములపర్రులో దళితులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే దిగుబాటి రాజగోపాల్

ఉండి: డిప్యూటీ స్పీకరైతే చట్టాలను అతిక్రమించి వ్యవహరిస్తారా? అని ఉండి ఎమ్మెల్యే రఘురామ కృష్ణరాజుపై మాజీ ఎమ్మెల్యే దిగుబాటి రాజగోపాల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని పాములపర్రు దళితుల శ్మశానంలో నుంచి ఇద్దరు ఆక్వా రైతుల కోసం రోడ్డు వేసే ప్రయత్నం చేస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో అడ్డుకున్న దళితులపై పోలీసులు దాడులు చేయడం ఉద్రిక్తతకు దారితీసింది. ఈ వ్యవహారం రోజురోజుకూ తీవ్ర రూపం దాలుస్తున్న నేపథ్యంలో కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితి (కేవీపీఎస్) నాయకుల బృందం మంగళవారం పాములపర్రులో పర్యటించింది. మాజీ ఎమ్మెల్యే దిగుబాటి రాజగోపాల్ దాడులు చేసిన ప్రాంతాన్ని, రోడ్డు వేయాలని భావిస్తున్న శ్మశాన భూమిని స్థానిక దళితులు, బృంద సభ్యులతో కలసి పరిశీలించారు. రాజగోపాల్ మాట్లాడుతూ దళితులకు రక్షణగా ఉన్న చట్టాలు, జీవోలను పక్కన పెట్టి, వారి జోలికి రావడం చాలా దారుణమని అన్నారు. శ్మశాన భూమి హద్దులు మార్చాలని గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎలా కోరతారని ఆయన ప్రశ్నించారు. తహసీల్దారు పంచాయతీ కార్యదర్శి ద్వారా ఎలా తీర్మానం తీసుకుంటారని నిలదీశారు. నాలుగో తేదీన కార్యదర్శి లేఖ రాస్తే ఐదో తేదీన శ్మశాన సరిహద్దులు మారుస్తూ తహసీల్దారు ఆర్డర్ ఇచ్చేస్తారా? అంటూ మండిపడ్డారు. పేదవారు రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేస్తే అధికారులకు వారాలు, నెలలు పడతాయి కానీ.. భూస్వాములకు కొమ్ముకాస్తే మాత్రం ఒక్కరోజు కూడా సమయం అవసరం లేకుండానే ఆర్డర్‌లు ఇచ్చేస్తారా? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదంతా ఎమ్మెల్యే, అధికారులు కలసి ఆడిన నాటకమని తీవ్రంగా మండిపడ్డారు. అందుకే అధికారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు.

దమ్ముంటే ఆక్రమణలు బయటపెట్టాలి

డిప్యూటీ స్పీకర్, రఘురామకృష్ణరాజుకు దమ్ముంటే, చిత్తశుద్ధి ఉంటే నియోజకవర్గంలో ఎంత ఆక్రమణ ఉందో తెలుసుకునేందుకు సర్వే చేయించి దాని వివరాలు పంచాయతీ కార్యాలయాల్లో అందుబాటులో ఉంచాలని రాజగోపాల్ సవాల్ చేశారు. పేదల శ్మశానం ఆక్రమణ అంటారా.. ఎవరు ఆక్రమణదారులో తెలుస్తుంది అంటూ మండిపడ్డారు. కేవీపీఎస్ జిల్లా బృందం సభ్యులు క్రాంతి బాబు, విజయ్‌లతో కలసి ఈ ఘటనపై పోరాటం మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. ఈ విషయాన్ని ఇంతటితో ముగించకపోతే నియోజకవర్గమంతా ఇదే సమస్య తలెత్తుతుందని చెప్పారు. రోడ్డు వేసేందుకు ముందుకు వెళితే అన్ని రాజకీయ పార్టీలు, దళిత సంఘాలతో కలసి ముందుకు వెళ్తామని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కోర్టులో కేసులు వేస్తామన్నారు. ఇప్పటికైనా రోడ్డు నిర్మాణం విరమించుకోకపోతే భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తాం, చలో పాములపర్రుకు పిలునిస్తాం.. కలెక్టర్‌ను కలుస్తాం.. ఇలా పాములపర్రు దళితులకు న్యాయం జరిగే వరకు పోరాడతామని తేల్చి చెప్పారు. తాను పదేళ్ళు ఎమ్మెల్యేగా పని చేశానని గుర్తుచేశారు. ఉండి నియోజకవర్గం ప్రశాంతంగా ఉండాలంటే వెంటనే శ్మశానంలో రోడ్డు వేసే ఆలోచన విరమించుకోవాలని డిమాండ్ చేశారు.

ఉద్యాన వర్సిటీ ఎంఓయూలు

తాడేపల్లిగూడెం: వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం మంగళవారం నాలుగు ప్రముఖ సంస్థలతో అవగాహన ఒప్పందాలు చేసుకుంది. బయోప్యాక్ ఇన్‌పుట్స్ ప్రైవేట్ లిమిటెడ్, మదనపల్లె ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్, జినో మిక్స్ సీఎఆర్ఎల్ ప్రైవేట్ లిమిటెడ్, సిస్ ఇన్నోవా ఎంటర్‌ప్రైజస్ ప్రైవేట్ లిమిటెడ్‌లతో ఎంఓయూ చేసుకున్నారు. ఉద్యానవన సాగు మొక్కల ఆరోగ్యం, పంట కోత తర్వాత సాంకేతికతను బలోపేతం, డ్రోన్లు, జీపీఎస్ ఆధారిత ఉత్పత్తులు, ఇమేజ్ ప్రోసెసింగ్, నానో టెక్నాలజీ, అధునాతన సాంకేతిక పరిజ్ఞానాలను ఉపయోగించడం, శాస్త్రీయ పురోగతిలకుగాను ఈ ఒప్పందాలు జరిగాయి.

పుంత రోడ్లు ఎక్కడ?

పొలాలకు వెళ్లే దారిలేక ఆక్వా, వరి రైతుల అవస్థలు



అధ్వాన్నంగా మారిన ఉండి శివారులోని కాలువగట్టు రోడ్డు

ఉండి: చోట్ల పుంత రోడ్లు ఆక్వా, వరి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాకాలంలో పుంతలు, కాలువ గట్లపై రోడ్లు లేకపోవడంతో చేలకు వెళ్లాలన్నా, పొలాలకు ఎరువులు, పురుగు మందులు, ఆక్వా చెరువులకు మేత తీసుకుపోవాలన్నా రైతులు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. పుంతలు లేని చోట్ల రోడ్లు వేసి రైతులకు అండగా నిలబడతామని చెప్పే ప్రజాప్రతినిధులు ఉండి నియోజకవర్గంలో వందలాది పుంతలు, కాలువ గట్లపై రోడ్లు లేక రైతులు ఇక్కట్లు పడుతుంటే పట్టించుకోవట్లేదు. వందలాది పుంతలపై రోడ్లు వేయాల్సి ఉండగా.. పాములపర్రులో శ్మశాన వాటికను పుంతగా చూపిస్తూ రోడ్డు వేయడానికి మాత్రం హడావుడి చేస్తున్నారు. అడుగు వేస్తే జారిపడిపోయే పరిస్థితుల్లో పుంతరోడ్లు ఉండగా వరి పొలాలకు ఎరువులు, ఆక్వా చెరువులకు మేతలు వంటివి తీసుకువెళ్ళేందుకు రైతులు అదనపు ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.

అదనపు ఖర్చుతో రైతుల ఇక్కట్లు

చేపలు, రొయ్యలు పట్టుబడి చేసేందుకు అదనపు ఖర్చుతో రైతులు భయపడిపోతున్నారు. వేసవి సమయంలో చెరువుల వద్దకు వెళ్ళే వాహనాలు ఇప్పుడు మెయిన్‌రోడ్డు కూడా దిగలేకపోవడంతో పట్టుబడి పట్టిన సరుకును మెయిన్‌రోడ్డుకు చేర్చేందుకు ఖర్చు చేయాల్సి వస్తోంది. దీంతో ఆక్వా రైతులు మరింత నష్టాల్లోకి వెళ్లిపోతున్నారు. అమెరికా సుంకాల భయాలతో ఇప్పటికే రైతులు తీవ్ర నిరాశలో ఉండగా.. పట్టిన సరుకు ఒడ్డుకు చేర్చేందుకు అదనపు ఖర్చుచేయాల్సి రావడంతో మరింత ఆర్థిక భారాన్ని మోయాల్సి వస్తోంది.

పుంత రోడ్లు ఎప్పుడు వేస్తారు?



నియోజకవర్గంలో వందలాది పుంతల్లో రోడ్ల నిర్మాణం చేయాలని రైతులు ఎంతో ఆశతో ఎదురు చూస్తున్నారు. రైతుల ప్రయోజనం కోసం పుంత రోడ్లు నిర్మిస్తున్నామంటూ కబుర్లు చెబుతున్నారు. రైతులు గగ్గోలు పెడుతున్న పుంతల్లో, కాలువ గట్లపై రోడ్లు వేయాలి.

– దానం విద్యాసాగర్, న్యాయవాది, పాములపర్రు

దళితుల ప్రాంతమే కావాలా?



పుంతరోడ్ల నిర్మాణానికి మేం వ్యతిరేకం కాదు. పుంతలేని ప్రాంతంలో ఉందని చెప్పి కేవలం ఇద్దరు ఆక్వారైతుల కోసం అధికారులు తమ అధికారాన్ని దుర్వినియోగం చేసి రోడ్డు వేస్తారా? దళితుల మనోభావాలు దెబ్బతినేలా వ్యవహరించి రోడ్డు వేయడం ఏంటి?

– తాళ్ళూరి మధు, బహుజన జేఏసీ కన్వీనర్

మా శ్మశానం జోలికి రావద్దు



రైతులు మా జోలికి రాలేదు. మేం వారి జోలికి వెళ్ళలేదు. ఇప్పుడు కూటమి ప్రభుత్వాన్ని అడ్డు పెట్టుకుని కొందరు స్వార్థపరులు అవకాశమే లేని చోట రోడ్డు వేయమంటున్నారు. మా శ్మశానం జోలికి ఎవ్వరూ రావద్దు. ఒకరినొకరు గౌరవించుకుంటూ ముందుకు సాగుదాం.

– దర్శి సాల్మన్, వార్డు సభ్యుడు, పాములపర్రు

క్లుప్తంగా

హెల్త్ సెంటర్ తనిఖీ



హెల్త్ సెంటర్‌ను తనిఖీచేసిన నోడల్ ఆఫీసర్

తాడేపల్లిగూడెం (టీఓసీ): జాతీయ నులుపురుగులు, అంటువ్యాధుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆల్బెండజోల్ టాబ్లెట్లు పంపిణీ చేశారు. కడకట్ల అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలోని పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ సెంటర్లలో పిల్లలకు పంపిణీ చేశారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అనీషా మాట్లాడుతూ 94 శాతం డోసులు అందజేసినట్లు తెలిపారు. పర్యవేక్షకులుగా నోడల్ ఆఫీసర్ డాక్టర్ దేవసుధా హాజరయ్యారు. ఆమె ఆధ్వర్యంలో ఎన్‌టీఆర్ అర్బన్ హెల్త్ సెంటర్‌ను తనిఖీ చేశారు. సెంటర్‌లో మందులు, స్టాక్ వివరాలు, ఇతర సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. పలు సూచనలు అందజేశారు.

ఘనంగా హర్‌ఘర్ తిరంగా ర్యాలీ



జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

పెంటపాడు: మండలంలోని అలంపురం టీబీఆర్ సైనిక్ స్కూల్‌లో మంగళవారం హర్‌ఘర్ తిరంగా ర్యాలీ ఘనంగా నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షురాలు దేవి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీలో టీబీఆర్ సంస్థల చైర్మన్ టి.భోగేశ్వరరావు, ఈతకోట తాతాజీ, ఆరాధ్యుల అంజి, దత్తు ప్రసాద్, పసుపులేటి అమ్మిరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు మానవత సమావేశం

పెంటపాడు: ఈ నెల 13న ఉదయం 9 గంటలకు పెంటపాడులో మానవత సంస్థ మండల సమావేశం నిర్వహించనున్నట్లు జిల్లా నాయకులు తాడేపల్లి మోహనరావు తెలిపారు. ఈ కార్యక్రమానికి మండల కమిటీ సభ్యులు హాజరుకావాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

ఉత్సాహంగా క్విజ్ పోటీలు

నరసాపురం: స్థానిక వైఎన్ కళాశాల ఇంగ్లిష్ క్లబ్ ఆంగ్ల విభాగం, టేలర్ హైస్కూల్ పూర్వ విద్యార్థుల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం క్విజ్ పోటీలను ఘనంగా నిర్వహించారు. ఇంగ్లీష్ క్లబ్ సమన్వయకర్త, కమ్యూనికేషన్ స్కిల్స్ ట్రైనర్ ఎం. సారంగపాణి మాట్లాడుతూ ఈ పోటీలు పట్టణ స్థాయిలో వివిధ కళాశాలల మధ్య గత కొన్ని రోజులుగా నిర్వహిస్తూ ఫైనల్ పోటీలు నిర్వహించామని చెప్పారు. విద్యార్థులమధ్య ఆరోగ్యకరమైన పోటీతత్వాన్ని పెంపొందించి, వారిమధ్య కళాశాలల మధ్య మంచి వాతావరణం పెంపొందేలా చేయడ మే క్లబ్ ముఖ్యలక్ష్యమన్నారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ అందే రామ్ సతీష్ మాట్లాడుతూ పోటీ తత్వాన్ని విజ్ఞానాన్ని పెంపొందించేలా క్విజ్ కార్యక్రమాన్ని నిర్వహించిన ఇంగ్లీష క్లబ్‌ను అభినందించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చింతపల్లి కనకారావు, డీన్ ప్రొఫెసర్ గంధం శ్రీ రామకృష్ణ, మేనేజ్మెంట్ స్టడీస్ హెడ్ ప్రొఫెసర్ పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

ఇక కళలకు దూరం

- తాడేపల్లిగూడెంలో దశాబ్దాలుగా కళలకు నిలయంగా బీవీఆర్ కళాకేంద్రం
- కోర్టు మార్గం కోసం ఆ ప్రాంగణాన్ని స్వాధీనం చేసుకున్న యంత్రాంగం
- తెరవెనుక డబుల్ గేమ్ ఆడిన ప్రజాప్రతినిధి



కళా కేంద్రం ప్రాంగణంలో కట్టడాలు, చెట్లు తొలగింపు

సాక్షి టాస్క్‌ఫోర్స్: తాడేపల్లిగూడెంలో ఎన్నో దశాబ్దాలుగా సాంస్కృతిక కార్యక్రమాలకు, రాజకీయ సభలకు, వైద్యశిబిరాలకు వేదికగా నిలిచిన బీవీఆర్ కళా కేంద్రం కళావిహీనమైంది. కళలు, నాటికలతో, సన్మాన వేడుకలతో ఎంతో మంది హృదయాల్లో మధుర స్మృతులు నిలిపిన ఈ కళావేదిక రూపురేఖలు కోల్పోనుంది. తాడేపల్లిగూడెం ఆఫీసర్స్ క్లబ్‌ను, అదే ప్రాంగణంలో ఉన్న కళాకేంద్రాన్ని మునిసిపల్ కమిషనర్ యేసుబాబు ఆధ్వర్యంలో మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. బీవీఆర్ కళాకేంద్రంను స్వాధీనం చేసుకోవద్దు అంటూ ప్రజలు, కళాకారులు విన్నవించుకున్నా ఫలి తం లేకుండా పోయింది. కళా వేదిక స్వాధీనం ప్రజల మనోభావాలకు గొడ్డలి పెట్టుగా నిలిచింది.

ఆనవాళ్లు లేకుండా..

మునిసిపల్ సిబ్బంది మంగళవారం జేసీబీలు, బుల్డోజర్లు, టిప్పర్ల సాయంతో ఆఫీసర్స్‌క్లబ్ ప్రాంగణానికి కోర్టుల సముదాయానికి మధ్యన ఉన్న కాంపౌండ్ వాల్‌ను కూలగొట్టారు. ప్రాంగణంలోని మరుగుదొడ్లను, సేద తీర్చే చెట్లను అడ్డంగా కూల్చివేశారు. ఆఫీసర్స్ క్లబ్‌కు పక్కగా ఉన్న చిన్న షెడ్డును పడగొట్టారు. కళాకేంద్రంలో ఉన్న ప్రముఖుల విగ్రహాలను తొలగించారు. ఏటా ఆగస్టు 15, జనవరి 26 తేదీల్లో జాతీయ పతాకాన్ని ఎగురవేసేందుకు ఏర్పాటు చేసిన పోల్‌ను తొలగించి, దిమ్మను పగలగొట్టారు. అప్పటికప్పుడు బీవీఆర్ కళాకేంద్రం పైన ఉన్న అక్షరాలను నల్ల రంగు పెయింట్‌తో మూసివేశారు. కక్షపూరితం అన్నట్లుగా కళాకేంద్రం అనవాళ్లను కనపడకుండా తీసివేశారు. ప్రాంగణాన్ని చదును చేశారు.

ముందస్తు జాగ్రత్త చర్యలు

ఆఫీసర్ క్లబ్ ప్రాంగణాన్ని స్వాధీనం చేసుకునే క్రమంలో ఏ విధమైన అవాంతరాలు జరగకుండా ఉండేందుకు అధికారులు ముందస్తు జాగ్రత్త చర్యలను తీసుకున్నారు. ఈ చర్యల్లో భాగంగా కేఎన్ రోడ్డు మార్గంలో ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్ ప్రవేశ మార్గం వద్ద, పోలీస్ స్టేషన్ సమీపంలో శివాలయం వద్ద స్టాపర్లను ఏర్పాటు చేసి తాత్కాలికంగా మూసివేశారు. అటువైపు ఎవరూ రాకుండా కట్టుదిట్టమైన భద్రత చర్యలు తీసుకున్నారు. అంబులెన్స్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. బస్సులను సైతం దారి మళ్లించారు. ఉదయం 6 నుంచి 9 గంటల వరకు రెండు వైపుల రహదారిని మూసివేయగా అనంతరం ఒక వైపు ట్రాఫిక్‌ను వదిలారు.

రాజకీయ కోణమే కారణమా!

ఆఫీసర్స్ క్లబ్ ప్రాంగణాన్ని స్వాధీనం చేసుకోవడం వెనుక రాజకీయ కారణాలు ఉన్నట్లు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఎంతో కాలంగా కొందరు రాజకీయ నాయకులు ఆఫీసర్స్ క్లబ్ ప్రాంగణంను స్వాధీనం చేసుకోవాలని ప్రయత్నించినా సాధ్యపడలేదు. ఇటీవల ఒక ప్రజాప్రతినిధి దీనిని సవాలుగా తీసుకుని అధికారులపై ఒత్తిడి తెచ్చారనే విమర్శలు విన్పిస్తున్నాయి. ప్రజా ప్రతినిధి బీవీఆర్ కళా కేంద్రం సభ్యులతో ఒకలా, అధికారులతో మరోలా ప్రవర్తించి తెర వెనుక డబుల్ గేమ్ ఆడారని పట్టణ ప్రముఖులు పేర్కొంటున్నారు. మొత్తానికి ప్రజాప్రతినిధికి, కళా కేంద్రం నిర్వాహకులకు వచ్చిన విభేదాలు కారణంగానే ఈ చర్యలు తీసుకున్నారని చెబుతున్నారు.

కమిషనర్ వివరణ

మునిసిపల్ కమిషనర్ ఎం.యేసుబాబు ఈ విషయంపై మాట్లాడుతూ ఆఫీసర్స్‌క్లబ్, కళా కేంద్రాలు గ్రామకంఠం, పోరంబోకులో ఉన్నాయన్నారు. కళా కేంద్రం ఉన్న స్థలం మధ్యలో నుంచి మార్గం కావాలని కోర్టు వారు లిఖిత పూర్వకంగా అడిగినట్లు చెప్పారు. ఆర్డీఓ ఆదేశాల మేరకు హక్కు పత్రాలు ఇవ్వాలని ఆఫీసర్స్ క్లబ్, బీవీఆర్ కళాకేంద్రం నిర్వాహకులకు నోటీసులు జారీ చేసినా వారు దాఖలు చేయకపోవడంతో ఆక్రమణలు తొలగించినట్లు చెప్పారు. భవిష్యత్తు అవసరాలకు కళాకేంద్రంను, ఆఫీసర్స్‌క్లబ్‌ను అవసరమైన వారు ఉపయోగించుకుంటారని, వీటి మధ్యలో నుంచి కోర్టువారికి ప్రధాన మార్గంగా ఏర్పాటు చేసినట్లు, ఆర్డీఓకు త్వరలో ప్రాంగణాన్ని అప్పగిస్తామని వివరించారు. తహసీల్దార్ ఎం.సునీల్ కుమార్ హాజరయ్యారు. ఆర్డీఓ ఖతీబ్ కౌసర్ బానోను వివరణ కోరగా కమిషనర్ యేసుబాబుతో మాత్రమే మాట్లాడాలని ఆమె సమాధానమిచ్చారు.



కట్టడాలు తొలగించేందుకు ఆంక్షలు విధించిన దృశ్యం



జేసీబీలతో కూల్చుతున్న ప్రాంగణంలో కమిషనర్, తహసీల్దార్, పోలీసులు



గోడ తొలగించిన తరువాత కళాకేంద్రంలో నుంచి కోర్టు ఆవరణ నేటి పరిస్థితి

రేపు ఉచిత మెగా వైద్య శిబిరం

పెంటపాడు: ఈ నెల 14న పెంటపాడు మండలం అలంపురం వెంకట రమణ చారిటీ ఆసుపత్రిలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ట్రస్టు చైర్మన్ కొలనువాడ పెద కృష్ణంరాజు తెలిపారు. రెండో గురువారం పురస్కరించుకొని అన్ని రకాల సాధారణ వ్యాధులు, గుండె వ్యాధులు, కాన్సర్ వ్యాధులు, స్త్రీల వ్యాధులు, చిన్నారుల వ్యాధులకు సంబంధించి నిపుణులైన వైద్యులు పరీక్షలు చేస్తారన్నారు. ఈ సేవలతో పాటు, ప్రతి నెలా రెండో గురువారం సంతాన సాఫల్యతా కేంద్రం ద్వారా స్త్రీలకు ఉచితంగా వైద్య పరీక్షలు చేస్తారన్నారు. 2డీ ఈకో, ఈసీజీ వైద్య పరీక్షలు కూడా ఆసుపత్రిలో అందుబాటులో ఉంచినట్లు ట్రస్టు చైర్మన్ కొలనువాడ పెదకృష్ణంరాజు తెలిపారు. పరిసర గ్రామాల ప్రజలు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

15న శ్రావణ లక్ష్మీ వ్రతాలు

పెంటపాడు: ప్రత్తిపాడు వై.జంక్షన్ కనకదుర్గమ్మ ఆలయంలో ఈ నెల 15న సామూహిక శ్రావణలక్ష్మి వ్రతాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో యాళ్ల శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. అర్చకులు కొత్త లంక సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ఉదయం 9 గంటల నుంచి ఈ వ్రతాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో పాల్గొనే భక్తులకు పూజా సామగ్రి ఉచితంగా అందజేస్తామన్నారు. పరిసర గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా ఈవో కోరారు.

వ్యవసాయ శాఖ ఏడీగా ప్రసాద్



నరసాపురం రూరల్: నరసాపురం సహాయ వ్యవసాయ సంచాలకులుగా పీవీవీ ఎస్ఎస్‌పీ ప్రసాద్ మంగళవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఏడీఏ గా పనిచేసిన ఈదా అనిల కుమారి ఏలూరు ఏడీఏగా బదిలీ కావడంతో ఆ పోస్టులో ప్రసాద్ చేరారు. ఈయన ఇప్పటివరకు నిడదవోలులోని బయోలాజికల్ కంట్రోల్ లేబరేటరీలో పని చేస్తూ బదిలీపై నరసాపురం వచ్చారు.

వైఎస్సార్ సీపీ హయాంలో మహిళలకు ప్రాధాన్యం



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళలకే అత్యధిక ప్రాధాన్యతనిచ్చి మహిళలను ఆర్థికంగా ఎదిగేలా చేశారని మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మంగళవారం నియోజకవర్గంలోని మహిళా నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ రాజకీయ చరిత్రలో నిరంతరం మహిళలకే పెద్దపీట వేశారని అదే స్ఫూర్తితో మహిళలు పార్టీ కోసం శ్రమించి పని చేశారని స్పష్టం చేశారు. కూటమి నేతలు అబద్ధపు హామీలతో గెలిచి అరాచకాలు, దాడులు, విధ్వంసాలు సృష్టిస్తున్నారన్నారు. కూటమి దాడులకు బెదరకుండా మహిళామణులు సైతం కూటమి కుళ్లు రాజకీయాలను తిప్పికొడుతున్నారన్నారు. కార్యక్రమంలో ఇరగవరం ఎంపీపీ కొప్పిశెట్టి మంగతాయారు, నియోజవర్గ మహిళా ధ్యక్షురాలు మెహర్ అన్సారీ, తణుకు పట్టణ, తణుకు, అత్తిలి మండలాల మహిళాధ్యక్షులు నూకల కనకదుర్గ, ఉండవల్లి జానకి, కాకర్ల జానకి, జిల్లా మహిళా మాజీ వైస్ చైర్మన్ బొంత యశోద, ఏఎంసీ మాజీ చైర్మన్ నత్తా కృష్ణవేణి పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేయాలి

వైఎస్సార్ సీపీని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేసేందుకు పార్టీ శ్రేణులు నడుంకట్టి పని చేయాలని వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల కమిటీ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ఇన్‌చార్జి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కొలుసు మోహన్‌యాదవ్ అన్నారు. తణుకు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామ స్థాయి నుంచి అన్ని అనుబంధ విభాగాల నియామకాలు ఈ నెలాఖరులోపు పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ రాజ్ రాష్ట్ర కార్యదర్శి వడ్లూరి సీతారాం, జిల్లా ఆర్గనైజేషన్ సెక్రటరీ యిండుగపల్లి బలరామకృష్ణ, పట్టణ అధ్యక్షుడు మారిశెట్టి శేషగిరి, నియోజకవర్గ మహిళాధ్యక్షురాలు మెహర్ అన్సారీ, పట్టణ మహిళాధ్యక్షురాలు నూకల కనకదుర్గ, తేతలి మాజీ సర్పంచ్ కోట నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ బి.శ్రీలత

తాడేపల్లిగూడెం: విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని డిప్యూటీ కమిషనర్ ఆఫ్ ప్రొహిబిషన్ ఎక్సైజ్ బి.శ్రీలత పిలుపునిచ్చారు. అంతర్జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకొని నషాముక్త భారత్‌లో భాగంగా ఏపీ నిట్‌లో మంగళవారం డ్రగ్స్ రహిత కళాశాల మా భవిష్యత్ అనే అంశంపై నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి నవ సమాజ నిర్మాణంలో మెరుగైన పాత్ర పోషించాలన్నారు. స్నేహితుల వత్తిడి వల్లో, సరదాగా యువత మత్తు పదార్థాలకు అలవాటు పడి భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని ఆమె హితవు పలికారు. అసిస్టెంట్ కమిషనర్ ప్రభుకుమార్ మాట్లాడుతూ డ్రగ్స్ రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. విద్యార్థులు చదువుపై దృష్టి పెట్టి బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలన్నారు. యాంటీ ర్యాగింగ్ గురించి గూడెం డీఎస్పీ డి.విశ్వనాథ్, రూరల్ సీఐ రవికుమార్ మాట్లాడారు. కార్యక్రమ కో–ఆర్డినేటర్ నిట్ అసోసియేట్ డీన్ రాజేశ్వర్‌రెడ్డి , రిజిస్ట్రార్ దినేష్ రెడ్డి, తదితరులు మాట్లాడారు. డ్రగ్స్ జోలికి వెళ్లమని విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



ఆర్టీసీ డిపోలో నిరసన తెలుపుతున్న ఎన్ఎంయూఏ నాయకులు

తణుకు అర్బన్: ఏపీఎస్ ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం తణుకు ఆర్టీసీ డిపో ఆవరణలో ఎన్ఎంయూఏ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పీఆర్‌సీ కమిషన్‌ను ఏర్పాటుచేయాలని, వేతన సవరణ జరిగి ఇప్పటికే రెండేళ్లు పూర్తైనందున వెంటనే ఐఆర్ ప్రకటించాలని, గవర్నర్‌పేట–2 డిపోకు చెందిన 4.15ఎకరాల స్థలాన్ని లులు సంస్థకు బదలాయిస్తూ ప్రభుత్వం ఇచ్చిన జీవోను ఉపసంహరించుకోవాలని, విశాఖ స్టీల్‌ప్లాంట్ డిపో తరలించడం నిలిపివేయాలని, పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను తక్షణమే చెల్లించాలని, రిటైర్డ్‌అయిన ఉద్యోగులకు గ్రాట్యుటీ, టెర్మినల్ ఎన్‌క్యాష్‌మెంట్ మొదలైన చెల్లింపులు తక్షణమే చేయాలని పలువురు డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో ఎన్ఎంయూఏ జిల్లా అధ్యక్షుడు ములగాల వెంకటరత్నం, డిపో సెక్రటరీ బయ్యే సుబ్బారావు, సహాయ కార్యదర్శి షేక్ సాదిక్, ఆర్గనైజింగ్ సెక్రటరీ పెన్మెత్స శ్రీనివాసరాజు, ఉద్యోగులు పాల్గొన్నారు.

రంగనాథన్‌కు ఘన నివాళి



శాఖ గ్రంథాలయంలో రంగనాథన్ జయంతిని నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక ప్రథమ శ్రేణి శాఖ గ్రంథాలయంలో మంగళవారం గ్రంథ పాలకుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. గణిత శాస్త్రజ్ఞులు, గ్రంథాలయ పితామహులు పద్మశ్రీ డాక్టర్ ఎస్ఆర్ రంగనాథన్ 133వ జయంతి నిర్వహించారు. అధికారి వి.శ్రీనివాసరావు పర్యవేక్షించారు. రిసోర్స్ పర్సన్లు ప్రత్తి వీరాస్వామి, ఏవీ లక్ష్మణరావు, జి.బాపయ్యశర్మ, జాన్‌బాబు మాట్లాడుతూ రంగనాథన్ జీవిత విశేషాలను వెల్లడించారు. పాఠకులకు పలు ఆసక్తికరమైన విషయాలను వెల్లడించారు. పాఠకులు, సీనియర్ సిటిజన్స్ పాల్గొన్నారు

రాజీతో కేసుల పరిష్కారం



సమావేశంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి సత్యవతి

తణుకు అర్బన్: రాజీ పడదగ్గ ప్రతి కేసును ఇరు వర్గాలు పరిష్కరించుకునే తరహాలో వారికి అవగాహన కల్పించాలని మండల న్యాయసేవా సంస్థ చైర్‌పర్సన్, నాల్గో అదనపు జిల్లా జడ్జి డి.సత్యవతి అన్నారు. తణుకు కోర్టు హాలులో మంగళవారం కోర్టు కానిస్టేబుళ్లకు నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. జాతీయ లోక్ అదాలత్‌తో పాటు కోర్టులో ప్రతి రోజూ నిర్వహించే మీడియేషన్ ద్వారా రాజీ పడే క్రిమినల్ కేసులతో పాటు చెక్‌బౌన్స్, మోటారు వాహన ప్రమాద కేసులు, చిట్ ఫండ్స్, భార్యా భర్తల తగాదాలు, అన్ని రకాల సివిల్ కేసులు రాజీ చేసుకోవచ్చనే విషయాన్ని ఇరు వర్గాలకు తెలపాలని సూచించారు. కార్యక్రమంలో బెంచ్ కోర్టు మెజిస్ట్రేట్ తాడి ఆంజనేయులు, కోర్టు కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.

వసుధ ఫౌండేషన్ ఆర్థిక సహాయం

పాలకొల్లుసెంట్రల్: ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడంలో ఎంతో ఆనందం ఉంటుందని కాస్మో కాంప్లెక్స్ అధ్యక్షులు గొట్టుముక్కల గాంధీభగవాన్‌రాజు అన్నారు. మంగళవారం పట్టణంలో వసుధ ఫౌండేషన్ అందించిన ఆర్థిక సహాయాన్ని అనారోగ్య బాధితులకు అందించారు. గాంధీ భగవాన్‌రాజు మాట్లాడుతూ ఆరుగురు నిరుపేదలకు వసుధ ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకట్రామరాజు రూ.70 వేలు, ఆయన స్ఫూర్తితో కాస్మో కాంప్లెక్స్ తరపున మరో రూ. 20 వేలు అందించారన్నారు.

గంబూషియా చేపల విడుదల



గంబూషియా చేపలను విడుదల చేస్తున్న సబ్ యూనిట్ అధికారులు, సిబ్బంది

తాడేపల్లిగూడెం (టీఓసీ): జాతీయ కీటక జనిత వ్యాధుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా దోమల లార్వాలను నిర్మూలించడానికి సబ్ యూనిట్ ఆధ్వర్యంలో గంబూషియా చేపలను మంగళవారం పట్టణంలోని అపరిశుభ్ర పరిస్థితుల్లో ఉన్న చెరువుల్లో విడుదల చేశారు. కొండయ్య చెరువు, వీకర్స్‌కాలనీ, కడకట్ల, యాగర్లపల్లి చెరువు, డీఎస్ చెరువుల్లో విడుదల చేశారు. సబ్ యూనిట్ ఆఫీసర్ ఎస్‌వీఎస్ ప్రసాద్ మాట్లాడుతూ దోమల నివారణను లార్వా స్టేజ్‌లోనే నిర్మూలించాలని తెలిపారు. సీజన్‌లో దోమలు ఎక్కువగా పెరుగుతాయని, మలేరియా, చికున్‌గున్యా, డెంగీ వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని, దోమ తెరలు వాడాలని విజ్ఞప్తి చేశారు. హెచ్ఏలు రామకృష్ణ, ప్రసాద్, కాంతారావు, రాధకృష్ణ, వార్డు శానిటరీ సెక్రటరీలు, మున్సిపల్ మేస్త్రీలు, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

రక్తహీనత నివారణకు ఆల్బెండజోల్



తాడేపల్లిగూడెం రూరల్: ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న వైద్య సిబ్బంది



ఇరగవరం: నులిపురుగుల నిర్మూలన మందులను ఇస్తున్న వైద్యులు

తాడేపల్లిగూడెం రూరల్: బాల బాలికల్లో రక్తహీనత నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు ఉపకరిస్తాయని మాధవరం పీహెచ్‌సీ వైద్యాధికారి ఏవీ వెంకటేష్ అన్నారు. నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మంగళవారం మండలంలోని మాధవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 1–19 ఏళ్ల లోపు బాల బాలికలకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఏవీ.వెంకటేష్ మాట్లాడుతూ 5879 పిల్లలకు గాను 5620 మంది పిల్లలకు మాత్రలు పంపిణీ చేశామన్నారు. డాక్టర్ సింధు, ఎంపీహెచ్‌ఈవో జి.వెంకటేశ్వరరావు, హెచ్‌వీ సీహెచ్‌వీఎస్.మణి, ఎంపీహెచ్ఎస్ రాజసుధ, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, హెల్త్ అసిస్టెంట్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రేలంగిలో..

ఇరగవరం: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఆగస్టు 12వ తేదీన జిల్లా అంతటా జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో రేలంగిలో 26 పాఠశాలల్లో 30 అంగన్‌వాడీ సెంటర్లు, 3113 మందికి నులిపురుగుల మందులు అందించామన్నారు. వైద్యులు సాయి రెడ్డి మాట్లాడుతూ పిల్లలు, కిషోర్ బాలలకు నులిపురుగుల నివారణతో ఎదుగుదల బాగుంటుందని అన్నారు. ఒకవేళ ఎవరైనా 12వ తేదీన తీసుకోకపోతే 20వ తేదీన ఆల్బెండజోల్ మాత్ర వేసుకునే విధంగా సంబంధిత సిబ్బంది ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు విజయ్‌కుమార్, ఎంపీహెచ్‌వో జి.ప్రసాద్, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, అంగన్ వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఫోటో రైటప్: 12టిఎన్‌కెఆర్‌జి01-290078